

ఆదర్శ బడి చదువులమ్మ ఒడి



జఫర్‌గడ్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల

- ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం
- ఈనెల 22 వరకు దరఖాస్తులకు అవకాశం
- ఇంటర్ వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన
- బాలికలకు ఉచిత హాస్టల్ వసతి
- ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష
- జిల్లాలో ఎనిమిది ఆదర్శ పాఠశాలలు

జఫర్‌గడ్/రఘునాథ్‌పల్లి, ఫిబ్రవరి 6: గ్రామీణ విద్యార్థుల కోసం 2013లో నాటి ప్రభుత్వం మండలాల వారీగా ఆదర్శ పాఠశాలలను నెలకొల్పింది. విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన అందిస్తోంది. వాటిల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలతో పాటు 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఇందులో 6వ తరగతిలో సీటు లభిస్తే.. ఇంటర్మీడియట్ వరకు ఎలాంటి ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి విద్య అందుతుంది. ఆదర్శ పాఠశాలలన్నింటికీ పక్కా భవనాలు, బాలికలకు హాస్టల్ వసతి వంటి సదుపాయాలు ఉన్నాయి.

జిల్లాలో 8 ఆదర్శ పాఠశాలలు...

జనగామ జిల్లాలో లింగాలఘనపురం, బచ్చన్నపేట, నర్మెట, రఘునాథ్‌పల్లి, జఫర్‌గడ్, స్టేషన్‌ఘన్‌పూర్, కొడకండ్ల, జనగామ మండలంలోని చౌడారంలో మొత్తం 8 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ఆరు నుంచి 10వ తరగతి వరకు ప్రతీ తరగతిలో వంద సీట్ల చొప్పున ఉన్నాయి. పాఠ్యాంశాలతో పాటు ఉపాధి అవకాశాల కల్పన కోసం ఈ పాఠశాలల్లో విద్యార్థులకు ఆయా కోర్సుల్లో వృత్తి విద్యను సైతం అందిస్తున్నారు.

22వ తేదీ వరకు గడువు..

ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు, 7 నుంచి 10 తరగతుల వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు విద్యాశాఖ ప్రకటన జారీ చేసింది. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఇందు కోసం విద్యార్థులు టీఎస్ఎంఎస్.సీజీజీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకో వాలి. 6వ తరగతిలో వంద సీట్లు, 7, 8, 9, 10 తరగతుల్లోని ఖాళీ సీట్లను ఈ ప్రవేశ పరీక్ష ద్వారా మెరిట్, రిజర్వేషన్‌ల ప్రాతిపదికన భర్తీ చేస్తారు.



ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష...

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఏప్రిల్ 1 నుంచి అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకో వాలి. పరీక్ష ఫలితాల ప్రకటన తరువాత అందిన మెరిట్స్ జాబితాల ప్రకారం విద్యార్థులను ఎంపిక చేస్తారు. మే 25 నుంచి 31వ తేదీ వరకు సర్టిఫికేట్ల పరిశీలన అనంతరం జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

ఎంపిక ప్రక్రియ ఇలా..

ప్రవేశ పరీక్ష ఆధారంగా, మెరిట్, రిజర్వేషన్ ప్రకారం విద్యార్థుల ఎంపిక ఉంటుంది. 6వ తరగతిలో ఉన్న వంద సీట్లలో 50 శాతం ఓపెన్ కేటగిరీలో భర్తీ చేస్తారు. 15 శాతం ఎస్సీలకు, 6 శాతం ఎస్టీలకు, 29 శాతం బీసీలకు సీట్లను కేటాయిస్తారు. దివ్యాంగులకు 3 శాతం కోటా ఉంటుంది. మొత్తం సీట్లలో బాలికలకు 33.3 శాతం ఉండేలా చూస్తారు.

పరీక్ష విధానం..

ప్రవేశ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో ఉం టుంది. ఒక్కో ప్రశ్నకు ఒక్క మార్కు చొప్పున మొత్తం 100 ప్రశ్నలకు 100 మార్కులు ఉంటాయి. 6వ తరగ తిలో ప్రవేశానికి నిర్వ హించే పరీక్షలో 5వ తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞాన శాస్త్రం. ఇంగ్లీషు పాఠ్యాంశాల నుంచి ఒక్కో సబ్జెక్టు నుంచి 25 చొప్పున ప్రశ్నలు ఉంటాయి. అలాగే 7 నుంచి 10వ తరగతి వారికి గణితం, సామాన్య శాస్త్రం, సాంఘీక శాస్త్రం, ఇంగ్లీషు నుంచి, ఒక్కో విభాగం నుంచి 25 చొప్పున మొత్తం 100 ప్రశ్నలు, 100 మార్కుల చొప్పున ఉంటాయి. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లీషు మీడియంలో ఉంటుంది. పరీక్ష రెండు గంటల పాటు నిర్వహిస్తారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య : దేవులపల్లి శ్రీకాంత్, ప్రిన్సిపాల్, ఆదర్శ పాఠశాల, జఫర్ గడ్



క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తాం. కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన ఉంటుంది. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక ప్రతిభా పాటవ పోటీల్లోనూ ఆదర్శ బాలబాలికలు విశేషంగా రాణిస్తున్నారు. పదవ తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నాం. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచితంగా విద్యను అందించే మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు విద్యార్థులకు ఓ చక్కని అవకాశం. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఈనెల 22వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

సద్వినియోగం చేసుకోవాలి : కె రాము, జిల్లా విద్యాశాఖాధికారి



ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు ప్రక్రియ ఆరంభమైంది. విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యాబోధనతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం, వృత్తి విద్యా బోధన, పరిశుభ్రమైన తాగునీరు వంటి సదుపాయలు ఉంటాయి. బాలికలకు ఉచిత వసతి గృహ సదుపాయం ఉంది. ఆంగ్లమాధ్యమంలో విద్యాబోధన ఉంటుంది. 6వ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు చదువుకోవచ్చు. ఆహ్లాదకర వాతావరణంతో పాటు సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్ బోధన వంటి సౌకర్యాలు ఆదర్శ పాఠశాలల్లో ఉన్నాయి. జిల్లాలోని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

నేటినుంచి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

వారం పాటు నిర్వహణకు ప్రభుత్వ ఆదేశాలు


పల్లెప్రగతిలో భాగంగా సీతారాంపురం పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న దృశ్యం (ఫైల్)

జనగామ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల్లో వారం రోజుల పాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం(స్పెషల్ శానిటేషన్ డ్రైవ్)ను నిర్వహించేందుకు సిద్ధమైంది. బుధవారం నుంచి అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 14 వరకు పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించింది. రోజూవారీగా చేయాల్సిన పనులకు సంబంధించి జిల్లా పంచాయతీ అధికారుల ద్వారా ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలోని 281 గ్రామ పంచాయతీలు, ఆవాస ప్రాంతాల్లో బుధవారం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. గత ప్రభుత్వం ప్రతీ ఏడాది జూన్, జూలై నెలలో ప్రల్లె ప్రగతి కింద ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించింది. గత ఏడాది ఆరో విడత పారిశుధ్య కార్యక్రమం 16 రోజుల పాటు జరిగింది. కాగా.. ప్రస్తుత ప్రభుత్వం ఫిబ్రవరి నెలలో పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

◆ **మొదటి రోజు - గ్రామ సభ ద్వారా పనుల గుర్తింపు:** ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని గ్రామ పంచాయతీల్లో మొదటి రోజు గ్రామ సభలను నిర్వహించుకొని మిగతా వారం రోజుల పాటు చేయాల్సిన పనులకు సంబంధించి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. గ్రామసభ ఏర్పాటు చేసిన అనంతరం గ్రామంలోని అన్ని వార్డులు, గ్రామంలోని వైకుంఠధామం, పల్లె ప్రకతివనం, సెగ్రిగేషన్‌షెడ్, క్రీడా ప్రాంగణం వంటి వాటిని సందర్శించి ప్రణాళిక తయారు చేయాలి. ఆ తర్వాత రోజు నుంచి ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం పనులు చేయాలి.

◆ **8న- పారిశుధ్యం, ప్రభుత్వ సంస్థల సందర్శన:** గ్రామంలోని రోడ్లను శుభ్రం చేయడం, గుంతలను పూడ్చడం, పిచ్చిమొక్కలను తొలగించడం చేయాలి. అదేవిధంగా గ్రామంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య కేంద్రాలు, బస్టాప్‌లను శుభ్రం చేయడం, మురుగు కాల్వల్లో మురుగు నీరు ఆగకుండా శుభ్రం చేయడం.

◆ **9న- డ్రై డే:** ఈనెల 9న శుక్రవారం రోజు డ్రై డేగా పరిగణించాల్సి ఉంటుంది. గ్రామంలోని లోతట్టు ప్రాంతాల్లో నీటిని తొలగించి పూడ్చాలి. అన్ని ఇళ్లల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలి.

◆ **10న- డ్రింకింగ్ వాటర్ స్పెషల్ డే:** గ్రామంలోని వాటర్ ట్యాంకులు, నీటి వనరులను శుభ్రం చేయడం, క్లోరినేషన్ చేయడం. పైప్‌లైన్, కుళాయి లీకేజీలను గుర్తించి మరమ్మతు చేయడం. నీటి గుంటల్లో దోమల నివారణను అరికట్టేందుకు గానూ నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడం, ఫాగింగ్ చేయడం

◆ **12న - నర్సరీ డే:** గ్రామంలోని నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలను సందర్శించడం. గ్రామంలోని పాడుబడ్డ బావులు, తెరిచిఉన్న బోరుబావులను పూడ్చడం చేయాలి. పాడుబడ్డ ఇళ్లను కూల్చివేయాలి.

◆ **13న - స్వచ్ఛభారత్ మిషన్ డే:** గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగాన్ని గురించి వివరించడం, కొత్త మరుగుదొడ్ల అవసరాన్ని గుర్తించడం. ఇళ్లలోని మురుగునీరును పెరట్లోని మొక్కలను వినియోగించడం, ఇంకుడు గుంతలకు మళ్లించడం చేయాలి. రెండు గుంతల టాయిలెట్స్, సెప్టిక్ ట్యాంక్ టాయిలెట్స్ నిర్మాణాలను పూర్తి చేయించాలి.

◆ **14న - వాటరింగ్ డే:** గ్రామంలోని అన్ని నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలను సందర్శించి మొక్కలకు నీరు పోయాలి. దీంతో వారం రోజుల ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం ముగుస్తుంది.

బాధితులకు బాసటగా భరోసా కేంద్రం

- వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా


భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీపీ, కలెక్టర్ తదితరులు

జనగామ టౌన్, ఫిబ్రవరి 6: లైంగిక దాడులకు గురైన మహిళలు, బాలబాలికలకు భరోసా కేంద్రం బాసటగా నిలుస్తుందని వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఉమెన్ సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని మంగళవారం రాష్ట్ర పోలీస్ డీజీపీ రవి గుప్తా, అడిషనల్ డీజీపీలు షికా గోయల్, మహేష్ భగవత్‌తో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం సీపీ అంబర్ కిషోర్ ఝా, కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, డీసీపీ సీతారామ్‌తో కలిసి హైదరాబాద్ రోడ్డులో ప్రైవేటు భవనంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ లైంగిక దాడులకు గురైన బాధితులకు ఇక్కడ న్యాయపరమైన సహకారంతో పాటు వైద్య, ఆర్థిక సహకారం అందుతుందన్నారు. అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇస్తారని అన్నారు. ఈ కేంద్రంలో లీగల్, మెడికల్ సిబ్బందితో పాటు ఇతర మహిళా సహాయ సిబ్బంది అందుబాటులో ఉంటారని అన్నారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, జనార్దన్‌రెడ్డి, కృష్ణ, వెస్ట్ జోన్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణకు కృషి చేద్దాం: కలెక్టర్

జనగామ టౌన్, ఫిబ్రవరి 6: నులి పురుగుల నివారణకు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య సూచించారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 12న కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్ సింగ్‌తో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1 - 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు నులి పురుగుల నివారణకు ప్రభుత్వం అందిస్తున్న మాత్రలు వేయాలన్నారు. ఇవి అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల పిల్లలకు ఇస్తారన్నారు. 1 - 2 సంవత్సరాల చిన్నారులకు సగం మాత్ర (కరిగించి), 3 సంవత్సరాల చిన్నారులకు ఒక పూర్తి (కరిగించి) మాత్ర, 4-19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఒక పూర్తి మాత్ర (నమిలి మింగాలి) వేయాలన్నారు. కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్ఓ శ్రీదేవి, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ భాస్కర్, డీడబ్ల్యూఓ జె.జయంతి తదితరులు పాల్గొన్నారు.

బాల్క సుమన్‌పై కాంగ్రెస్ ఆగ్రహం

- సీఎం రేవంత్ రెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్
- జిల్లాలో దిష్టిబొమ్మలు దహనం చేసిన కార్యకర్తలు

వివరాలు 3లో...


జనగామలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మహాజాతరకు.. నేడు అంకురార్పణ

మేడారంలో గుడిమెలిగే పండుగకు సర్వం సిద్ధం

జాతర ముగిసే వరకు వడ్డెల కఠిన ఉపవాసం


మేడారంలోని సమ్మక్క ఆలయం

మేడారం, ఫిబ్రవరి 6: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు బుధవారం అంకురార్పణ జరగనుంది. ప్రధానమైన గుడిమెలిగే పండగను వడ్డెలు (పూజారులు) నిర్వహించనుండగా.. ఇందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మేడారం మహాజాతరకు రెండు వారాల ముందు రెండు ప్రధాన పూజా ఘట్టాలను నిర్వహిస్తారు. మొదటిది గుడి మెలిగే పండుగ కాగా, రెండోది మండ మెలిగే పండుగ. గుడి మెలిగే పండుగను బుధవారం ఘనంగా నిర్వహిస్తారు. జాతరలో భక్తుల పూజలందుకునే ప్రధాన దేవతలు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల పూజా మందిరాలు గతంలో గడ్డి గుడిసెలుగా ఉండేవి. రెండేళ్లకోసారి జరిగే మహాజాతరకు రెండు వారాల ముందు పాతబడ్డ పైకప్పు, కర్రలను తొలగించేవారు. వాటి స్థానంలో కొత్త కర్రలు, దూలాలు, పైకప్పుపై గుట్ట గడ్డిని కప్పేవారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారంగా దైవాలకు పూజలు చేసి గుడి శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించే వారు. దీనిసే గుడి మెలిగే పండుగగా పిలుస్తారు. కాలక్రమంలో గడ్డి గుడిసెల స్థానంలో శాశ్వత ప్రాతిపదికన పూజా మందిరాలు నిర్మితమయ్యాయి. అయినప్పటికీ సంప్రదాయాల కొనసాగింపుగా పూజారులు గుడిమెలిగే తంతును జరుపుతూ వస్తున్నారు. బుధవారం ఉదయం మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ, కొండాయిలోని గోవిందరాజులు, పూనుగొండ్లలోని పగిడిదరాజుల ఆలయాల్లో వడ్డెలు సంప్రదాయ పూజలు చేసిన తర్వాత ఆలయాలను శుద్ధి చేయనున్నారు. తర్వాత దూపదీప నైవేద్యాలను సమర్పిస్తారు. వేకువజామున పూజారులు, కుటుంబ సభ్యులు ఇళ్లను శుద్ధి చేసుకుంటారు. అనంతరం జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించి మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ పూజా మందిరాలను దర్శించుకుంటారు. కాళ్లకు చెప్పులు లేకుండా ఉపవాసంతో ఉండి గుట్ట గడ్డిని సేకరించి డోలు వాయిద్యాల నడుమ తీసుకొచ్చి మందిరం పైకప్పుపై వేస్తారు. మహిళలు అటవీ ప్రాంతం నుంచి పుట్ట మట్టిని సేకరించి పూజామందిరాలలోని దేవతల గద్దెలను అలుకు పూతలు చేస్తారు. రంగుల ముగ్గులు వేసి అందంగా అలంకరిస్తారు. జాతర ప్రారంభ సూచికగా తొలిపూజ జరుగుతుండటంతో బుధవారం వనదేవతల గద్దెలను దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తులు మేడారం తరలిరానున్నారు. వచ్చే బుధవారం(14వ తేదీన) ప్రధానమైన మండ మెలిగే పండగ జరగనుంది. ఆ రోజు మేడారానికి నలువైపులా ద్వారబంధనాలు, రక్షా తోరణాలు కడుతారు. పూజామందిరాలలోని సామగ్రిని శుభ్రం చేస్తారు. మహాజాతర నిర్విఘ్నంగా జరగాలని, వనదేవతల దర్శనానికి వచ్చిన భక్తులు క్షేమంగా గమ్యస్థానాలు చేరాలని వేడుకుంటూ వడ్డెలు గ్రామ, పొలిమేర దేవతలకు సంప్రదాయ పూజలు చేస్తారు. 21వ తేదీ నుంచి 24 వరకు మహాజాతర జరుగుతుండగా ఇప్పటి నుంచే వడ్డెలు కఠిన నియమాలు పాటిస్తారు. నిష్ఠతో కఠిన ఉపవాసం పాటిస్తారు. జాతర ముగిసిన తర్వాత వారం రోజులకు తిరుగువారం పండుగను నిర్వహించారు. జాతర ముగిసినట్టు ప్రకటిస్తారు.


కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయం

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య
- జఫర్‌గడ్‌లో ప్రజా సంఘాల బైక్ ర్యాలీ

జఫర్‌గడ్, ఫిబ్రవరి 6: ప్రజలు, కార్మికుల హక్కులను కేంద్ర సర్కార్ కాలరాస్తోందని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య విమర్శించారు. ఈనెల 16న నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జఫర్‌గడ్‌లో స్థానిక గాంధీ సెంటర్ వద్ద ఈ ర్యాలీని రాపర్తి సోమయ్య ప్రారంభించి మాట్లాడుతూ తొమ్మిదేళ్ల మోదీ పాలనలో కార్మికులు, ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్లకు విక్రయిస్తూ ఉపాధిని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే, రక్షణ, విద్యుత్‌తో పాటు పలు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. ధరల పెరుగుదలను అరికట్టడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. బీజేపీ పాలనలో సామాన్య, పేద మధ్యతరగతి ప్రజల జీవనం కష్టతరంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగం, రైతులకు మొండి చేయి చూపారన్నారు. బీజేపీ సర్కార్ అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 16న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రైతు, వ్యవసాయ కార్మిక, సీఐటీయూ ప్రజా సంఘాల అధ్యక్షులు కాట సుధాకర్, గుండెబోయిన రాజు, వడ్లకొండ సుధాకర్, నక్క యాకయ్య, నాయకులు సిద్ధం సోమయ్య, నల్లతీగల శ్రీనివాస్, నర్సింహం, బంగారు చిరంజీవి, ఎర్ర రవి, పెద్ద రాములు, గంగరాజు, శంషోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య

ప్రయాణికుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు

మేడారం జాతరలో 55 ఎకరాల్లో బస్టాండ్

'ఆంధ్రజ్యోతి'తో ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఆర్ఎం శ్రీలత

వివరాలు 7వ పేజీలో

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 93.69% విద్యార్థుల హాజరు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 6: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం రెండో విడత ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం సెషన్‌లో జనరల్, వొకేషనల్ విద్యార్థులతో కలిపి 519 మందికి గాను 479 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 337 మంది విద్యార్థులకు 323 మంది హాజరయ్యారు. మొత్తం 856 మందికి గాను 802 మంది (93.69 శాతం) విద్యార్థులు హాజరైనట్లు డీఐఈవో భైరి శ్రీనివాస్ తెలిపారు.

కాగా జిల్లా కేంద్రంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల, బచ్చన్నపేట మోడల్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను డీఐఈవో భైరి శ్రీనివాస్, డెక్ సభ్యులు కె.ఆంజనేయ రాజు సందర్శించారు.

కేయూ ఎల్‌ఎల్‌బీ పరీక్షల ఫీజు గడువు 17

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 6: కాకతీయ యూనివర్సిటీ ఎల్‌ఎల్‌బీ మూడేళ్ల కోర్సుల 3, 5, ఐదేళ్ల కోర్సుల 3,7,9 సెమిస్టర్ల పరీక్షల ఫీజులను ఫిబ్రవరి 17 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధి కారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. రూ.250 అపరాధ రుసుంలో ఫిబ్రవరి 20 వరకు ఫీజులు చెల్లించుకోవాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 17 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఎల్‌ఎల్‌ఎం కేయూ మూడో సెమిస్టర్ పరీక్షల ఫీజులను చెల్లించుకోవాలని అధికారులు తెలిపారు. ఎంసీఏ (సీబీసీఎస్), ఎంబీఏ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజులను ఫిబ్రవరి 17 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించుకోవాలని పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరు ఫీజులు చెల్లించుకోవాలని రూ.250 అపరాధ రుసుంతో ఫిబ్రవరి 20 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఇద్దరు బీటెక్ విద్యార్థులపై కత్తితో దాడి

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 6: హనుమకొండ పోలీసుస్టేషన్ పరిధిలోని పోచమ్మకుంట సగరకాలనీలో అద్దెకు ఉంటున్న ఇద్దరు బీటెక్ విద్యార్థులపై ఒకరు కత్తితో దాడి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ దాడిలో ఒకరికి తీవ్రగాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన ఇదిగాని జెడ్‌సన్, గీసుగొండకు చెందిన కోల అరవింద్, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడకు చెందిన తాటిపల్లి సుమంత్‌లు పోచమ్మకుంటలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నగరంలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. కాగా, వారు ఉంటున్న ఇంటి సమీపంలో మరో ఇంటిలో పాముకుంట్ల రాకేశ్ అనే విద్యార్థి అద్దెకు ఉంటున్నాడు.

ఈ క్రమంలో రాకేశ్ సోదరుడు రాజ్‌కుమార్ తమ్ముడిని చూసేందుకు సోమవారం వచ్చాడు. రాత్రి మద్యం సేవించిన తర్వాత తమ్ముడు ఉంటున్న గదిలో గట్టిగా అరవడం, అక్కడకు వచ్చిన వారిని దుర్భాషలాడి అల్లరి చిల్లర చేశాడు. ఇమేమిటని బయటకు వచ్చిన జడ్సన్, అరవింద్, సుమంత్‌లను హేళన చేస్తూ ఎందుకు వచ్చారు? చంపేస్తా..? అని బెదిరిస్తూ నానా దుర్భాషలాడాడు. భయపడి ముగ్గురు గదిలోకి వెళ్లగా వారి ఉంటున్న గదిలోకి రాజ్‌కుమార్ బలవంతంగా ప్రవేశించాడు. కూరగాయలు కోసేందుకు ఉపయోగించే కత్తితో దాడికి దిగాడు. అరవింద్‌ను కత్తితో చాతిలో గట్టిగా పొడిచాడు. అడ్డుకునేందుకు వెళ్లిన సుమంత్ చేతిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర కత్తి గాయాలు కాగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. రక్తం మడుగులో ఉన్న అరవింద్‌ను 108 సహాయంతో చికిత్స కోసం ఎంజీఎంకు తరలించారు. జెడ్సన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

జనగామలో బెల్టుషాపుపై దాడులు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 6: జనగామలో ఓ ఇంటిపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో రూ.6వేల విలువ గల వివిధ రకాలైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ పట్టణం వీవర్స్‌కాలనీలో ఉంటున్న రంగు నాగయ్య అనే వ్యక్తి చాలా కాలంగా ఇంటినే అడ్డాగా చేసుకుని మద్యం విక్రయిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి పెద్ద ఎత్తున మద్యాన్ని పట్టుకున్నారు. నాగయ్యను అరెస్టు చేసి విచారించారు.



మాట్లాడుతున్న ఆర్ఎం శ్రీలత

ప్రయాణికుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు

ఆంధ్రజ్యోతి వన-జన జాతర February 21-24 2024

మేడారం జాతరలో 55 ఎకరాల్లో బస్టాండ్
ఈనెల 18 నుంచి నిరంతరం బస్సులు నడిపిస్తాం..
'ఆంధ్రజ్యోతి'తో ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం శ్రీలత



మేడారంలో సిద్ధం చేస్తున్న బస్టాండ్ ప్రాంగణం

హనుమకొండ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జరిగే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు ఆర్టీసీ బస్సులను నడిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోంది. గతంలో కన్నా ఈ సారి మరిన్ని ఎక్కువ బస్సులను నడవబోతోంది. ప్రతీసారి మేడారం జాతరకు కోటి మందికిపైగా భక్తులు తల్లుల దర్శనానికి వస్తారు. వీరిలో 20 లక్షల మందికిపైగా ఆర్టీసీ బస్సుల్లోనే వనదేవతల సన్నిధికి చేరుకుంటారు. ఈ సారి మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం ఉన్నందు వల్ల మహిళలు మరింత ఎక్కువ సంఖ్యలో జాతరకే రావచ్చునని అంచనా వేస్తున్నారు. ఆ మేరకు బస్సుల సంఖ్యను పెంచడంతో పాటు ఏర్పాట్లను కూడా విస్తృతంగా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బస్సు ప్రయాణ ఏర్పాట్లపై ఆర్టీసీ వరంగల్ రీజియన్ రీజినల్ మేనేజర్ శ్రీలత 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు. ఆ విషయాలు ఆమె మాటల్లోనే..

ఆరు వేల బస్సులు

మేడారం జాతరకు ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా 41 ఆపరేషన్ పాయింట్ల నుంచి ఆరువేల బస్సులను నడపనున్నాం. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 9 డిపోల పరిధిలో 17 పాయింట్ల నుంచి 2500 బస్సులను నడుపుతాం. 2022లో రాష్ట్రవ్యాప్తంగా 2800 బస్సులనే నడిపాం. కరోనా వల్ల భక్తుల రద్దీ లేకపోవడంతో బస్సుల సంఖ్య కూడా తగ్గింది. ఈసారి భక్తులు అధిక సంఖ్యలో జాతరకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం వల్ల మహిళలు ఇంకా ఎక్కువ మంది వస్తారని అంచనా వేస్తున్నాం. ఆ మేరకు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రత్తగా బస్సుల సంఖ్యను కూడా పెంచుతున్నాం. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో మహిళలు పెద్ద సంఖ్యలో రానున్న వారి కోసం ప్రత్యేకంగా బస్సులను నడపడం అంటూ ఏమీ ఉండదు.

ఈ నెల 18 నుంచి బస్సులు

ఈనెల 18 నుంచి మేడారానికి బస్సులు క్రమంగా నడుపుతాం. ఇప్పటికే జాతరకు బస్సులు నడుపుతున్నాం. ప్రతీ రోజు 50 బస్సులు మేడారానికి వెళుతున్నాయి. ప్రతీ బుధ, ఆదివారాల్లో 79 బస్సులు వెళుతున్నాయి. జాతర ముగిసే వరకు బస్సుల నడుస్తాయి. అప్పటి వరకు అన్ని రూట్లలో బస్సులు అందుబాటులో ఉంటాయి. ఈ సారి 40లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నాం.

55 ఎకరాల్లో బస్‌స్టేషన్

భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఈసారి మేడారంలో బస్‌స్టాండ్‌ను కూడా మరింత విశాలంగా ఏర్పాటు చేస్తున్నాం. ఇది వరకు 40 ఎకరాల్లో బస్‌స్టాండ్ ఏర్పాటు చేసేది. ఈ సారి అదనంగా మరో 15 ఎకరాల స్థలం అదనంగా తీసుకున్నాం. మొత్తం 55 ఎకరాల్లో బస్‌స్టాండ్‌ను ఏర్పాటు చేస్తున్నాము. క్యూలైన్లను కూడా పెంచుతున్నాము. ఇదివరకు బస్‌స్టాండ్‌లో 39 క్యూలైన్లు ఉండేది. ఈసారి ఈ సంఖ్యను 45కు పెంచుతున్నాం. బస్టాండ్‌లో భక్తుల కోసం అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. ముఖ్యంగా తాగునీటి కోసం రెండు ఆర్‌వోఆర్ ప్లాంట్లను అందుబాటులో ఉంచుతున్నాం. ఇందులో ఒకటి బస్‌స్టాండ్, రెండోది క్యూలైన్ల వద్ద ఉంటుంది. ప్రయాణికులకు తాగునీరు అందించేందుకు, తగిన మార్గదర్శనం నెరిపేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని కూడా తీసుకుంటున్నాం. బస్‌స్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికుల కోసం 80 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నాం.

పార్కింగ్‌కు అదనపు స్థలం

ఈ బస్సు సంఖ్య పెంచినందువల్ల పార్కింగ్ సమస్య రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం. మేడారంలో బస్‌స్టాండ్‌లో 2వేల బస్సులు నిలిచేందుకు మాత్రమే స్థలం ఉంది. మిగతా బస్సుల పార్కింగ్ కోసం కామారం వద్ద 18 ఎకరాలతో అదనంగా మరో పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నాం. బస్‌స్టాండ్‌లో బస్సులు ఖాళీ అవుతుంటే కామారంలో పార్కింగ్ చేసిన బస్సులను ఇక్కడికి పంపిస్తాం. దీనివల్ల బస్‌స్టాండ్‌లో ఒత్తిడి తగ్గుతుంది. రద్దీ సమస్య ఉండదు.

రీజియన్ నుంచి 50 శాతం సర్వీసులు

ఆర్టీసీ వరంగల్ రీజియన్ పరిధిలోని మొత్తం 741 బస్సుల్లో 365 బస్సులను మేడారం స్పెషల్‌గా నడుస్తున్నాయి. మిగతావి రీజియన్ పరిధిలోనే ఆయా డిపోల పరిధిలోని జాతర బస్ పాయింట్ల వద్దకు ప్రయాణికులను చేరవేయడానికి నడుస్తాయి. జాతరకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులే నడుస్తాయి. హైదరాబాద్ తదితర దూర ప్రాంతాల నుంచి సూపర్ ఎక్స్‌ప్రెస్ ఏసీ బస్సులు నడుస్తాయి.

150 కొత్త బస్సులు

జాతర కోసం ప్రస్తుతం ఉన్నవాటితో పాటు 150 కొత్త బస్సులను కూడా నడపనున్నాం. వరంగల్ రీజియన్‌కు 50 కొత్త బస్సులు వచ్చాయి. వీటితో పాటు అదనంగా మరో 100 కొత్త బస్సులను జాతరలో నడపాలని నిర్ణయించుకున్నాము. కొత్త బస్సులు ఈ నెల 18 నుంచి జాతర భక్తులకు అందుబాటులోకి వస్తాయి.

15వేల సిబ్బంది

జాతరలో బస్సుల నిర్వహణకు 15వేల మందిని నియమిస్తున్నాం. డిపో మేనేజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, సెక్యూరిటీ ఆఫీసర్లు, ట్రాఫిక్ అధికారులు, మెకానిక్‌లు తదితర సిబ్బంది వీరిలో ఉంటారు. బస్సుల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సిబ్బంది కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం.

నాలుగు చోట్ల మెకానికల్ క్యాంపులు

జాతరలో సాంకేతిక సమస్యలు తలెత్తి మార్గ మధ్యలో ఎక్కడైనా బస్సులు నిలిచిపోయిన పక్షంలో తక్షణం అక్కడకు చేరుకొని వాటికి మరమ్మతులు చేసేందుకు నాలుగు చోట్ల - మేడారం, తాడ్వాయి, పస్రా, గట్టమ్మ వద్ద మెకానికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నాం. ఒక్కొక క్యాంపులో ఆరుగురు మెకానిక్‌లు, ఇద్దరు ఎలక్ట్రీషియన్లు ఉంటారు. వీరు ఎక్కడ బస్సు నిలిచిపోయినా తక్షణం అక్కడి వెళ్లి వాటిని బాగు చేస్తారు. బాగుకాకపోతే ఆ బస్సును క్రేన్ సహాయంతో పక్కన పెడతారు. పన్నెండు మొబైల్ వ్యాన్ల (డీజీబీ)ను కూడా తాడ్వాయి, నార్లాపూర్, పస్రా, గట్టమ్మ దేవాలయం, ఘనపూర్, కాటారం తదితర ప్రాంతాల్లో ప్రతీ 25 కి.మీ. ఒకటి చొప్పున అందుబాటులో ఉంటాయి. ఈ మొబైల్ వ్యాన్లను బస్సును బాగు చేయడానికి అవసరమైన విడిభాగాలు సిద్ధంగా ఉంటాయి. చెడిపోయిన బస్సుల వల్ల బస్సుల రాకపోకలకు అంతరాయం కలగకుండా వాటిని ఎత్తి పక్కన పెట్టేందుకు రెండు క్రేన్లు, ఒక ట్రాక్టర్‌ను సైతం సిద్ధంగా ఉంచుతున్నాం. ఈ మొబైల్ వ్యాన్లలో ఉన్నవారి ఫోన్లను డ్రైవర్లకు, ఇతర సిబ్బందికి ఇస్తాం. వారు ఎక్కడైనా బస్సు ఆగిపోతే వారు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగానే మొబైల్ వ్యాన్ తక్షణం అక్కడి చేరుకొని బస్సుకు మరమ్మత్తు చేస్తుంది.

వైర్‌లెస్ సెట్లు

జాతర మార్గంలో బస్సుల రాకపోకలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవి సాఫీగా ముందుకు సాగేలా చర్యలు తీసుకునేందుకు కూడా ఏర్పాట్లు చేస్తు న్నాం. ఇందుకోసం స్క్వాడ్లను ఏర్పాటు చేస్తున్నాం. 15 జీపులు, 6 మోటార్ సైకిళ్లపై వీరు తిరుగుతూ బస్సుల రాకపోకలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటారు. వైర్‌లెస్ సెట్లద్వారా సమాచారాన్ని తెలుసుకుంటారు. ప్రతీ 25 కి.మీ. మధ్య ఒక స్క్వాడ్ నిరంతరం తిరుగుతూనే ఉంటుంది. జాతర మార్గం మొత్తాన్ని ఈ స్క్వాడ్లు కవర్ చేస్తూ ఉంటాయి.

ట్రాకింగ్ పరికరాలు

జాతర మార్గంలో బస్సుల రాకపోకలను నిరంతరం గమనించేందుకు ట్రాఫిక్ డివైస్‌లను కూడా వినియోగిస్తున్నాం. హనుమకొండ -మేడారం మధ్యలో వీటిని ఉపయోగిస్తాం. తాడ్వాయి- మేడారం మధ్య ఇంటర్‌నెట్ వ్యవస్థ సరిగా పనిచేసేదానిపై వీటి వాడకం ఉంటుంది. అయితే హనుమకొండ- తాడ్వాయి మధ్య మాత్రం ఇవి పని చేస్తాయి. హనుమకొండ ఆర్ఎం కార్యాలయంలోని సెంటర్ కామాండ్ సిస్టమ్‌లో ఈ ట్రాకింగ్ డివైస్‌లు అనుసంధానం అయి ఉంటాయి. బస్సులు ఎలా నడుస్తున్నాయి? ఎంత వేగంతో నడుస్తున్నాయి? ఎక్కడైనా నిలిచిపోయాయా? ఏదైనా బస్సుకు సమస్య వచ్చిందా? అనేది కమాండ్ కంట్రోల్ రూంలోని మానిటర్ల ద్వారా ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటాం. ఆ మేరకు సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ అయినా ఈ మానిటర్ల ద్వారా తెలుసుకోవచ్చు.

బస్ పాయింట్లు

మేడారం వెళ్లే భక్తుల కోసం నగరంలో, అన్ని డిపో కేంద్రాల్లో 17 బస్సు పాయింట్లను ఏర్పాటు చేస్తున్నాం. నగరంలో వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల వద్ద, అలాగే హనుమకొండలోని హయగ్రీవచారి గ్రౌండ్‌లో వీటిని ఏర్పాటు చేస్తున్నాం. జనగామలోని ప్రిస్టన్ స్కూల్, స్టేషన్‌ఘనపూర్, తొర్రూ రు, వర్ధన్నపేట, మహబూబాబాద్, నర్సంపేట, కొత్తగూడ, పరకాల, చిట్యాల, ఘనపూర్, భూపాలపల్లి, కాళేశ్వరం, కటారం తదితర ప్రాంతాల్లో బస్సు పాయింట్లు అందుబాటులో ఉంటాయి. ఇక్కడ ప్రయాణికులతో బస్సులు నిండగానే వెంట వెంటనే బయలుదేరుతాయి.

మేడారం ప్రధాన ద్వారం ముస్తాబు

తాడ్వాయి, ఫిబ్రవరి 6: మండలకేంద్రంలోని మేడారం సమ్మక్క-సారలమ్మ ప్రధాన ద్వారాన్ని రంగు రంగులతో ముస్తాబు చేస్తున్నారు. మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 21నుంచి 24వతేదీ వరకు జరిగే మహాజాతర సందర్భంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో గల మేడారం ఆర్చ్, గేటుకు రంగురంగులతో సమ్మక్క-సారలమ్మ దేవతల విగ్రహాలకు, సలహారానికి ముస్తాబు చేస్తున్నారు. ఈఏడాది అమ్మవార్లను దర్శించుకునేందుకు లక్షలాదిమంది భక్తులు తరలిరానుండడంతో ఈప్రాంతాన్ని అధికారులు శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. తాడ్వాయిలో ఎక్సైజ్, పోలీస్, ఆర్టీసీ, వైద్యఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర విభాగాల అధికారులు వారంరోజులపాటు ఉండేందుకు బస ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. దీంతోపాటు విద్యుత్‌శాఖ అధికారులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా లైన్లను ఏర్పాటు చేస్తున్నారు. మరో వారంరోజుల్లో ఏర్పాటుచేసిన బస కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. ఏది ఏమైనప్పటికీ బుధవారం నుంచి మేడారం జాతర ఆరంభానికి నాంది పలుకుతుండడంతో భక్తులు అధిక సంఖ్యలో వస్తూ అమ్మవార్లను దర్శించుకుంటున్నారు.



తాడ్వాయిలో ముస్తాబు అవుతున్న తోరణం



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

వన దేవతలకు భక్తుల మొక్కులు

మేడారం, ఫిబ్రవరి 6: మేడారం మహాజాతరకు ముందుగా తరలివస్తున్న భక్తులు సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్నారు. మంగళవారం 30వేలకుపైగా భక్తులు తరలివచ్చి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి గద్దెల వద్దకు చేరుకుని పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. యాట మొక్కులు తీర్చుకుని మేడారం పరిసరాల్లోని చెట్ల కింద విడిది చేశారు.

ములుగును సమ్మక్క సారలమ్మ జిల్లాగా నామకరణం చేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు

మేడారం, ఫిబ్రవరి 6: ములుగుకు వనదేవతలు సమ్మక్క, సారలమ్మ జిల్లాగా నామకరణం చేయాలని మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, తుడుందెబ్బ ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ డిమాండ్ చేశారు. ములుగు జిల్లా సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ముంజాల భిక్షపతి అధ్యక్షతన మేడారంలోని హరిత హోటల్ ప్రాంగణంలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ములుగు జిల్లాకు వనదేవతల పేర్లను అధికారికంగా ప్రకటించాలన్నది ప్రజల ఆకాంక్ష అని తెలిపారు. గత ఏడాది ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమ్మక్క, సారలమ్మ సన్నిధి నుంచి హాత్ సే హాత్ జోడో యాత్రను ప్రారంభించారని, ఆ సమయంలో ఇచ్చిన హామీ మేరకు జిల్లాకు సమ్మక్క, సారలమ్మల పేరును అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గతంలో నూతనంగా ఏర్పడిన కొన్ని జిల్లాలకు ఆయా ప్రాంతాల్లోని పుణ్య క్షేత్రాల పేర్లు పెట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్దన్, ఉపాధ్యాయుల సంఘం, నగరబేరి రాష్ట్ర కార్యదర్శి పోరిక ఉదయ్ సింగ్, పలు సంఘాల నాయకులు శ్రీనివాస్, నవీన్, వేణు, చింత కృష్ణ, శ్రావణ్, కృష్ణప్రసాద్, మహేష్, రత్నం, పూజారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సందర్శించిన డీఎంహెచ్‌వో



వైద్య శిబిరాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో అప్పయ్య

మేడారం, ఫిబ్రవరి 6: తాడ్వాయి మండలం మేడారం మహాజాతర సందర్భంగా పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆరు వైద్య శిబిరాలను జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ అల్లెం అప్పయ్య మంగళవారం సందర్శించారు. వైద్య సేవల రికార్డులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. మంగళవారం వరకు 3,250 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. చికిత్స పొందిన భక్తుల్లో అధికంగా గొంతు నొప్పి, జలుబు, జ్వరం, దగ్గు, వాంతులు, విరేచనాలతో వచ్చిన వారు ఉన్నారని అన్నారు. వారికి అవసరమైన మందులు అందించామని తెలిపారు. ఆది, బుధవారాలు భక్తులు అధిక సంఖ్యలో వస్తున్న దృష్ట్యా అనారోగ్యంతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని తెలిపారు.

సీజేఐటీలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 6: యశ్వంతాపురం క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల (సీజేఐటీ)లో మంగళవారం ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కార్పొరేట్ సొసైటీ రెస్పాన్స్‌బిలిటీ ఆధ్వర్యంలో పేపాల్ ఫౌండేషన్ సహకారంతో ఐసీటీ విభాగం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ డి. విజయపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఐసీటీ ఇప్పటి వరకు దేశ నలుమూలల నుంచి సుమారు లక్ష మంది గ్రామీణ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను కల్పించిందని, 25 వేలకు పైగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహించిందని అన్నారు. ఇందులో భాగంగా కళాశాలలోని 121 మంది విద్యార్థులను ఎంపిక చేశారని తెలిపారు. వీరికి అడ్వాన్స్ టెక్నాలజీ పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, ఐసీటీ హెడ్ బి.గోపాల్, ఆర్ఎం షేక్ గౌస్ పాషా, దినేష్, టి.అషర్, సరిత, నీలిమ, సుధీర్, సందీప్, డాలీ, నాగరాజు, మీనా, అర్చన తదితరులు పాల్గొన్నారు.

లారీల మధ్య ఇరుక్కొని డ్రైవర్ దుర్మరణం

రఘునాథపల్లి, ఫిబ్రవరి 6: రఘునాథపల్లి టోల్ ప్లాజా సమీపంలో మంగళవారం రెండు లారీల మధ్య ఇరుక్కొని నల్గొండ జిల్లా చింతపల్లి మండలం చౌళ్ల తండాకు చెందిన డ్రైవర్ ఇస్లావత్ రవి(26) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళేశ్వరం నుంచి హైదరాబాద్ వెళుతున్న ఇసుక లారీని డ్రైవర్ ఇస్లావత్ రవి రోడ్డు పక్కనే ఆపి పక్కన ఉన్న స్టాల్‌లో టీ తాగడానికి వెళ్లాడు. ఇదే సమయంలో మరో ఇసుక లారీని డ్రైవర్ భూక్య బిక్కు.. రవి ఆపిన లారీ ముందు నిలిపి అతను కుడా టీ తాగేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇస్లావత్ రవి డ్రైవర్‌గా ఉన్న లారీకి హ్యాండ్ బ్రేక్ వేయక పోవడంతో అది మెల్లిగా ముందుకు కదులుతుండగా తను గమనించి లారీని ఆపాలనే ఆత్రుతతో రెండు లారీల మధ్య నుంచి అవతలివైపు వెళ్తుండగా మధ్య ఇరుక్కొని తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు వాటర్‌ట్యాంకును ఢీకొని యువకుడి మృతి..



మేడిపల్లి కళ్యాణ్ (ఫైల్)

రఘునాథపల్లి మండల కేంద్రంలోని ఖిలాషాపూర్ రోడ్డు సమీపంలో కారు మిషన్ భగీరథ వాటర్ ట్యాంకును ఢీకొని జనగామ పట్టణంలోని బాణాపురంనకు చెందిన మేడిపల్లి కళ్యాణ్ (22) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జనగామ మండలం ఎర్రగొల్లపాడు గ్రామానికి చెందిన చిర్ర సాయి లక్ష్మారెడ్డి తన స్నేహితులైన మేడిపల్లి కళ్యాణ్, వినయ్, వంశీరెడ్డిలతో కలిసి కారులో మంగళవారం మల్లన్నగండికి వెళ్లి తిరిగి వస్తుండగా రఘునాథపల్లి ఏఎస్ఆర్ గార్డెన్ సమీపంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకును ఢీకొట్టారు. ఈ ఘటనలో మేడిపల్లి కళ్యాణ్ అక్కడిక్కడే దుర్మరణం చెందగా, మిగతా ముగ్గురికి గాయాలయ్యాయి.

సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం కమిటీ ఎన్నిక

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 6: తెలంగాణ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం (టీఎస్ఎస్‌టీఎఫ్) జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నారు. మంగళవారం జనగామ జిల్లా కేంద్రం లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షునిగా ఎం.కనకయ్య, జనరల్ సెక్రటరీగా ఎం.సుభాష్, ఉపాధ్యక్షులుగా కిరణ్ కుమార్, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎం.ఝాన్సీ, కార్యదర్శిగా పి.ప్రవీణ్ కుమార్, కోశాధికారిగా ఎం.విజయ కుమార్, అదనపు కోశాధికారిగా శ్రీదేవి, సలహాదారులుగా జి.రామచంద్రం, డి.వెంకటేశ్వర్లు, బి.హరిలాల్, డి.దేవేందర్‌ను ఎన్నుకున్నారు.

బాల్క సుమన్‌పై కాంగ్రెస్ ఆగ్రహం

- సీఎం రేవంత్ రెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్

జనగామ టౌన్, ఫిబ్రవరి 6: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్ వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జనగామ చౌరస్తాలో బాల్క సుమన్, మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటాన్ని దహనం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని అగౌరవపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. రానున్న కాలంలో బీఆర్ఎస్ పార్టీ మనుగడ కోల్పోతుందన్నారు. బాల్క సుమన్‌పై ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, చెంచారపు బుచ్చిరెడ్డి, వేమళ్ల సత్యనారాయణరెడ్డి, మేడ శ్రీనివాస్, ఆలేటి సిద్ధిరాములు, పిట్టల సతీష్, బండారి శ్రీనివాస్, నల్ల శ్రీరాములు, బడికె ఇందిర కృష్ణస్వామి, కౌన్సిలర్ జక్కుల అనిత వేణు, కాముని జయ శ్రీనివాస్, జాఫర్ షరీఫ్, అజారుద్దీన్ పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: సీఎం రేవంత్ రెడ్డిని చెప్పుతో కొడుతా అని చెప్పు చూపించిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ బట్టలూడదీసి తరిమికొడుతామని జడ్పీటీసీ మారపాక రవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు డివిజన్ కేంద్రంలో బాల్కసుమన్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి అనంతరం బస్టాండ్ వద్ద చెప్పులతో కొడుతూ దహనం చేశారు. కార్యక్రమంలో నాగరబోయిన శ్రీరాములు, అమరేందర్ రెడ్డి, రమేష్, నీల శ్రీధర్, గుర్రం యాదగిరి, చింత జోత్స్న, సింగపురం నాగయ్య, చింత ఎల్లయ్య, ఐలపాక శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల: మండలకేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ మాజీ ఎంపీ బాల్క సుమన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కొద్దిసేపు బస్టాండు చౌరస్తాలో ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమనర్సయ్య, ధర్మారం భిక్షపతి, ఎస్. శశి, రామ్మూర్తి, వలభోజు రమేష్, గఫూర్, వంశీ, మనోహర్, వెంకన్న , మురళి, శ్రీనివాస్, పల్లె అనిల్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గడ్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం జఫర్‌గడ్‌లో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. బాల్క సుమన్ వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో నూకల ఐలయ్య, అన్నెబోయిన భిక్షపతి, మంచాల ఎల్లయ్య, సిహెచ్.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పాలకుర్తి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆయన ఫ్లెక్సీని రాజీవ్ చౌరస్తాలో దహనం చేశారు. మరోసారి వ్యాఖ్యలు చేస్తే నాలుక చీరేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, పెద్ది కృష్ణమూర్తి, జల్లం కుమారస్వామి, కొంరోజు సోమన్న, మాచెర్ల పుల్లయ్య, చిలువేరు సంపత్, గణేష్, పులి భాస్కర్, చిలువేరు బాలరాజు పాల్గొన్నారు.

దేవరుప్పుల: సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం దేవరుప్పుల చౌరస్తాలో బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పెద్ది కృష్ణమూర్తి, ధరావత్ రాజేష్, భూక్యా సజ్జన్, ఉప్పుల అనిల్, మాసంపెల్లి మహేందర్, రెడ్డిరాజుల రమేష్, సోమ నర్సయ్య, తోటకూరి సందీప్, ఉప్పుల ప్రకాష్, కొంగరి ఉమేష్, నిఖిల్, లొడంగి అశోక్, చింత శ్రీకాంత్, గనుపాక నాగరాజు పాల్గొన్నారు.

లింగాలఘణపురం: సీఎం రేవంత్‌రెడ్డి పట్ల అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బాల్క సుమన్ దిష్టిబొమ్మను మంగళవారం లింగాలఘణపురం మండలం నెల్లుట్ల వద్ద దహనం చేశారు. బాల్క సుమన్ అహంకార వైఖరిని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో నాయకులు బత్తిని అశోక్‌కుమార్, దామెర నాగరాజు, కొయ్యడ రామలింగం, మారబోయిన ఉప్పలయ్య, గడ్డం యాదగిరి, కడకంచి గట్టయ్య, దీకొండ రాజు, సుమన్ లక్ష్మణ్, భాస్కర్, నర్సింగ రమేశ్, శ్రీకాంత్, యోనా తదితరులు పాల్గొన్నారు.

నర్మెట: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్ దిష్టిబొమ్మను నర్మెట చౌరస్తాలో దహనం చేశారు. ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే రాష్ట్ర ప్రజలు తరిమికొడ్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో గంగం నర్సింహరెడ్డి, గొల్లపల్లి కుమారస్వామి, గాదె మోహన్‌రెడ్డి, కూకట్ల చంద్రమౌళి, చెవుల పరుశరాములు, ఎసళ్ల అంజయ్య, చంద్రకళ, భాగ్యలక్ష్మి, రేణుక, ప్రజ్ఞాపురం శ్రీధర్, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

తరిగొప్పుల: "బాల్క సుమన్.. నీ స్థాయి మరిచి మాట్లాడితే నాలుక తెగ్గోస్తాం... నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు బిడ్డా" అని కాంగ్రెస్ పార్టీ తరిగొప్పుల మండలాధ్యక్షుడు చిలువేరు సంపత్ హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డిపై బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ నాయకులు మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఇష్టం వచ్చినట్లు మొరిగితే జనాలు రాళ్లతో కొట్టి చంపుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వగలబోయిన యాదగిరి, దామెర థామస్, పండుగ కనుకయ్య, చెన్నూరి సుధాకర్, మంద చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ కుమార్, మామిడాల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



ఘన్‌పూర్‌లో బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



పాలకుర్తిలో బాల్క సుమన్ ఫ్లెక్సీని చెప్పుతో కొడుతున్న నాయకులు



దేవరుప్పులలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న శ్రేణులు



నెల్లుట్లలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పార్టీ శ్రేణులు



కొడకండ్లలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



జఫర్‌గడ్‌లో బాల్క సుమన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నేతలు



నర్మెటలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కాంగ్రెస్ పార్టీతోనే క్రిస్టియన్లకు గుర్తింపు

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ పార్టీతోనే క్రిస్టియన్లకు గుర్తింపు వస్తోందని ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆనంద్ కుమార్ తెలిపారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని బేతేలు చర్చిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం తీరుతో క్రైస్తవులు అభద్రతాభావంతో ఉన్నారని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే క్రైస్తవులకు మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మత పెద్దలు మార్టిన్ లూథర్, గడ్డం ప్రతాప్, మోసెస్, సీమోన్, రమేష్, జయరాజు, జోసఫ్, సంపత్, కొర్నేలు, కేసీ జాన్‌బన్నీ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 6: మండలంలోని ఛాగల్ గ్రామంలో సీడీఎఫ్, 15వ ఫైనాన్స్ నిధులు రూ.10లక్షలతో మంగళవారం సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ కనకం స్వరూప-గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీటీసీగా ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు చేశానని, రానున్న రోజుల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో మరిన్ని పనులు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి డీటీ విజయ్‌కుమార్, సెక్రటరీ అశ్విన్‌కుమార్, నాయకులు మాదిరెడ్డి రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు నివారణకు కృషి చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఫిబ్రవరి 6: కుష్టు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని నోడల్ అధికారి జి.కొమురయ్య అన్నారు. మంగళవారం జాతీయ కుష్టు నివారణ కార్యక్రమం, స్పర్శ్ లెప్రసీ అవగాహనా ఉద్యమంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. లెప్రసీ నివారణకు కృషి చేస్తామని విద్యార్థులు, వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. గాంధీ చౌరస్తా వద్ద మానవ హారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యాధిని ముందుగా గుర్తిస్తే నివారించవచ్చన్నారు. కుష్టు లక్షణాలు కనిపించగానే వైద్య సిబ్బందిని సంప్రదించి పౌష్టికాహారం తీసుకుంటూ మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి జనార్దన్, హెచ్ఎం షరోన్, సీహెచ్‌ఓలు చింత వెంకటస్వామి, సాంబయ్య, టి.డేవిడ్, రవికుమార్ పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడి అరెస్ట్

బచ్చన్నపేట, ఫిబ్రవరి 6: మండలంలోని ఓ గ్రామంలో బాలికపై అత్యాచారం చేసిన యువకుడు టి.నరేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం అతడిని జనగామ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. నిందితుడిపై ఆరు సెక్షన్‌ల కింద పోక్సో, రేప్ కేసులు నమోదు చేశామన్నారు.

విజ్ఞానాభివృద్ధికి ఎన్ఆర్ఐ చేయూత



పాఠశాలకు టీవీలను బహూకరిస్తున్న ఎన్ఆర్ఐ రాజ్‌కుమార్‌రెడ్డి

జఫర్‌గడ్, ఫిబ్రవరి 6: సాంకేతికతతో విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధన, శాస్త్రీయ విజ్ఞానం అందించేందుకు గాను మండలంలోని కూనూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు స్థానిక వాస్తవ్యులు ఎన్ఆర్ఐ పల్లెపాటి రాజ్‌కుమార్‌రెడ్డి రెండు ఎల్ఈడీ టీవీలను బహూకరించారు. రూ.80 వేలు విలువ గల దృశ్య శ్రవణ పరికరాలను ఆయన తన తండ్రి మల్లారెడ్డితో కలిసి మంగళవారం హెచ్ఎం కె.సురేందర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సామాజిక అంశాల పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు దృశ్య శ్రవణ సాంకేతిక పరికరాలు దోహదపడతాయన్నారు. విద్యార్థుల్లో విజ్ఞానం పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. విద్యార్థులు సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా దాత రాజ్‌కుమార్‌రెడ్డికి హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు.

వినియోగదారుల వివరాలు సేకరించండి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



ఘన్‌పూర్‌లో విద్యుత్ సిబ్బందిని వివరాలు అడుగుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 6: గృహ విద్యుత్ వినియోగదారుల వివరాలను త్వరితగతిన సేకరించాలని టీఎస్ఎన్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలలో ఒకటైన గృహజ్యోతి పథకాన్ని అమలు పరుచడంలో భాగంగా రెండు రోజులుగా విద్యుత్ సిబ్బంది గ్రామాల వారీగా వినియోగదారుల వివరాలను సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని మంగళవారం డివిజన్ కేంద్రంలో సీఎండీ తనిఖీ చేసి వినియోగదారులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతీ ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ సదర్‌లాల్, ఎస్ఈ వేణుగోపాల్, జనగామ, ఘన్‌పూర్ డీఈలు లక్ష్మీనారాయణ, హుస్సేన్‌నాయక్, ఏడీఈ సత్యనారాయణ, ఏఈలు చంద్రమోహన్, శివకుమార్ పాల్గొన్నారు.

రఘునాథపల్లి: రఘునాథపల్లి సబ్‌స్టేషన్‌లో గల ఈఆర్‌వో కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకానికి సంబంధించిన బిల్లింగ్ ప్రక్రియను ఎన్పీడీసీఎల్ సీఎండీ కె.వరుణ్ రెడ్డి మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. గృహజ్యోతి పథకం కింద లబ్ధిదారుల ఆధార్ కార్డుతో పాటు రేషన్ కార్డు అప్‌డేట్‌ను పరిశీలించి బిల్లింగ్ చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ టి.సదర్‌లాల్, జనగామ ఎస్ఈ టి.వేణుమాధవ్, డీఈ ఎంఎల్ఎన్ రెడ్డి, ఏడీఈ మనోహర్ రెడ్డి, ఏఈ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.


క్వారీ అనుమతులను రద్దు చేయాలి: సీపీఎం

దేవరుప్పుల, ఫిబ్రవరి 6: శ్రీవానకొండయ్య లక్ష్మీనరసింహస్వామి (దేవునిగుట్ట) క్వారీ తవ్వకం అనుమతులను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు సింగారపు రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు సంఘటితమై గుట్ట పరిరక్షణకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో సీపీఐ, కాంగ్రెస్, బీఎస్పీ, ఎమ్మార్పీఎస్, గిరిజన నాయకులు బిల్లా తిరుపతిరెడ్డి, గడ్డం యాదగిరి, రాపాక శ్రీశైలం, పడమటింటి నర్సింహా, ధరావత్ రాజేష్, భూక్యా సజ్జన్, ఉప్పుల అనిల్, మాసంపెల్లి మహేందర్, రెడ్డిరాజుల రమేష్, సోమనర్సయ్య పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందిస్తాం

బచ్చన్నపేట, ఫిబ్రవరి 6: మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీఎస్‌సీ సెంటర్‌లో పీహెచ్‌సీ వైద్యాధికారి సిద్దార్థరెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నట్టు తెలిపారు. కాగా, ఆస్పత్రిలో గైనకాలజిస్టు అందుబాటులో ఉండేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు సూపరింటెండెంట్ దృష్టికి తీసుకురాగా, ఉన్నతాధికారులతో మాట్లాడతానన్నారు. స్థానిక ఆస్పత్రితో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందిస్తున్నామన్నారు. సమావేశంలో వైద్యులు మహేశ్, రూప, సౌజన్య, సుదర్శన్‌రెడ్డి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కూనూరు బాలికలు



బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన బాలికలు

జఫర్‌గడ్, ఫిబ్రవరి 6: మండలంలోని కూనూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు బాలికలు బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఇటీవల హన్మకొండలోని జెఎన్ఎస్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పల్లె గౌతమి, సుతారి రిషిత, శనబోయిన పూజ (8వ తరగతి) పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం ఎండి.పర్వేజ్, పీఈటీ యాదగిరి తెలిపారు. వీరు ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు హైద్రాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా బాలికలను మంగళవారం హెచ్ఎం, పీఈటీతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

బచ్చన్నపేట, ఫిబ్రవరి 6: ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించినట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు. నర్మెట మండలం మలక్‌పేట గ్రామానికి చెందిన మాచర్ల రాజు ఆరు మాసాల క్రితం మండలంలోని పోచన్నపేట దుర్గామాత ఆలయంతో పాటు సాల్వాపూర్ కొండ పోచమ్మ దేవాలయంలో చోరీలకు పాల్పడినట్టు తెలిపారు. మంగళవారం స్థానిక బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తే గతంలో చేసిన దొంగతనాలు ఒప్పుకున్నట్టు వివరించారు. సొత్తును రికవరి చేసినట్టు తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

నర్మెట, ఫిబ్రవరి 6 : కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలలో నాలుగు గ్యారంటీలను ప్రభుత్వం ఏర్పడిన యాభై రోజుల్లోనే అమలు చేయడంతో మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి మండలకేంద్రంలోని చౌరస్తాలో క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా డీసీసీ కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి మాట్లాడుతూ రూ. 500లకు వంటగ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి

చిలుపూర్, ఫిబ్రవరి 6: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి తీగల మహేందర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఫతేపూర్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించాలని సూచించారు. అనంతరం పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామాధ్యక్షునిగా గుగులోతు రమేష్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా మానేపల్లి భాస్కర్‌ను ప్రకటించారు.

బుగులు వెంకన్నకు సువర్ణ పుష్పార్చన

చిలుపూర్, ఫిబ్రవరి 6 : మండల కేంద్రంలోని బుగులు వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం స్వామివారికి ఘనంగా సువర్ణ పుష్పార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. పూజారులు స్వామివారి పాదాలను 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పూజారి బ్రాహ్మణపల్లి రవిందర్ శర్మ మాట్లాడుతూ, ప్రతీ మంగళవారం నిర్వహించే సువర్ణ పుష్ప, అష్టదళ పాద పద్మారాధన పూజకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడం శుభ పరిణామమన్నారు.

చెక్‌డ్యాంలతో నీటి ఎద్దడిని అరికట్టవచ్చు

లోడి సాంఘిక సంస్థ డైరెక్టర్ ఇన్నారెడ్డి



సంస్థ నిర్మించిన చెక్‌డ్యాంల వద్ద లోడి ప్రతినిధులు

తరిగొప్పుల, ఫిబ్రవరి 6: వాగులు, కాల్వలపై చెక్‌డ్యాంలు నిర్మించడం ద్వారా సాగు నీటి ఎద్దడిని అరికట్టడంతోపాటు భూగర్భ జలాలను పెంపొందించవచ్చని లోడి సాంఘీక సంస్థ డైరెక్టర్ ఫాదర్ ఇన్నారెడ్డి అన్నారు. మండలంలోని బొత్తలపర్రె, జాలుబాయితండ గ్రామాలలో మానోస్ యూనిదాస్ వారి ఆర్థిక సహాయంతో వారు చెక్‌డ్యాంలు నిర్మించి మంగళవారం రైతులకు అందుబాటులోకి తీసకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాలు పెరిగితే సాగునీటికి ఎద్దడి ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో కోడం సత్యనారాయణ, సభ్యులు భూక్య బిచ్చ, ముడావర్ తిరుమల, పిల్లి రమేష్ పాల్గొన్నారు.

చింతగట్టు జాతర వేలం పాటల ఆదాయం రూ.8.65లక్షలు



వేలంపాటలు నిర్వహిస్తున్న దేవాదాయ అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 6: మండలంలోని ఇప్పగూడెం, కోమటిగూడెం, రంగరాయగూడెం, అక్కపల్లిగూడెం గ్రామాల పరిధిలోని చింతగట్టు సమ్మక్క-సారలమ్మ జాతరలో వివిధ వస్తువులను విక్రయించు హక్కులు పొందడానికి గాను మంగళవారం దేవాదాయశాఖ కార్యనిర్వహణ అధికారి లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటల్లో జాతరకు రూ 8,65,000 ఆదాయం వచ్చింది. 1) కొబ్బరికాయలు, బెల్లం, పసుపు కుంకుమలు, 2) కోళ్ల విక్రయ హక్కు, 3) కూల్ డ్రింక్స్ అమ్ముకొను హక్కు పొందడానికి గాను వేలం పాటలు నిర్వహించగా అక్కపల్లిగూడెం గ్రామం పరిధిలో రూ.17,000, రంగరాయగూడెం గ్రామం పరిధిలో రూ 58,000, కోమటీగూడెం గ్రామం పరిధిలో రూ.70,000, ఇప్పగూడెం గ్రామం పరిధిలో రూ.2,30,000, గద్దెల పరిధిలో రూ.4,90,000 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. నాలుగు గ్రామాలతో పాటు గద్దెల వద్ద విక్రయహక్కులు పొందడానికి గాను నిర్వహించిన వేలంపాటల ద్వారా జాతరకు మొత్తం రూ.8,65,000 ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సీఐ నట్ల రాజు, ఎస్సై నాగరాజు, జాతర అభివృద్ధి కమిటీ బాధ్యులు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, మందపురం ఎల్లాగౌడ్, కత్తుల కట్టయ్య, చట్ల యాకయ్యగౌడ్, నెలమంచ అజయ్ రెడ్డి, మునిగెల రమేష్, పల్లె రవీందర్, ఎమ్డీ షైపాషా, మంద రాజు, కొడెపాక యాకయ్య, దాసరి రాజు, గొడుగు రాజు, ఐతా రమేష్, వీరేషం, నాగబండి సంతోష్, ఆరుట్ల సందీప్ రెడ్డి, సంపత్ రెడ్డి, ధర్మయ్య, పాల్గొన్నారు.